క్లుప్తంగా

రేపు మెగా రక్తదాన శిబిరం

కడప సెవెన్‌రోడ్స్ : 13వ మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఉదయం పాత కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలోని దూదేకుల కులస్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని దూదేకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మున్నూరు అక్బర్ కోరారు. బుధవారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి యేటా డిసెంబరు 1వ తేదీ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు ఓబులేశు, బాబయ్య, పీఎం బాష, రూపనగుడి హుసేన్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఎన్‌సీసీ సీటీఓ డి. విన్నీతేజ మాట్లాడుతూ 30 మంది ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారన్నారు. హ్యాండ్ ఫర్ యూ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన ఎన్‌సీసీ కేడెట్స్‌కు సర్టిఫికెట్లు అందజేశారు.

శ్రీ సోమసుందరేశ్వరునికి వెండి కవచం



వెండి కవచాన్ని అందజేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సోమసుందరేశ్వరస్వామికి భక్తులు వెండి కవచం సమర్పించారు. కార్తీకమాసంలో శివయ్యను ఆరాధించడం పుణ్యదాయకమని భావించిన భక్తులు గాజులపల్లి రాఘవేంద్ర, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి అర్చకులు చంద్రమౌళిశర్మకు వెండి కవచాన్ని అందజేశారు.

విద్యార్థుల ఆందోళన



ఆర్ట్స్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. కళాశాలలో విద్యార్థులు నిర్వహించుకునే అకడమిక్ ఫెస్టివల్స్‌కు ప్రిన్సిపాల్ అనుమతులు ఇవ్వడం లేదంటూ కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు అశోక్, ఫిర్దోస్, ఆశిక్‌లు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. కళాశాలలో తాగునీటి సమస్య, డెస్కుల సమస్య, క్రీడాకారులకు ఉన్న సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అనంతరం కడప నగర కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ వద్దకు విద్యార్థులు, ప్రిన్సిపాల్ వెళ్లి సమస్య పరిష్కారంపై చర్చించారు. దీంతో విద్యార్థులు ఆందోళన వీడారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడాసామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రిని అందజేస్తున్న డీఎస్‌ఏ సిబ్బంది

కడప స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల నిర్వహణకు సంబంధించి ప్రక్రియ వేగవంతం అయింది. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలు, సచివాలయాలకు క్రీడాసామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర'కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు జరిగాయన్నారు. పోటీల నిర్వహణ కోసం సచివాలయ స్థాయి పోటీలకు బేసిక్ క్రీడాసామగ్రి, నియోజకవర్గస్థాయి పోటీలకు ప్రొఫెషనల్ క్రీడాసామగ్రి కిట్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అబ్దుల్ మునాఫ్, శ్రీనివాసరాజు, సుదర్శన్, కల్యాణ్, నూర్, విలియం కేరీ, స్టెప్ సిబ్బంది నాగయ్య, అబ్బాస్, సుబ్బారావు, ఫల్గుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి పెద్దపీట



పనులను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

కడప స్పోర్ట్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో రూ. 2 కోట్ల అంచనాతో డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న గ్యాలరీ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్రీడాకారుల కోసం 'ఆడుదాం ఆంధ్ర' మెగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎస్‌ఏ క్రీడామైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు మాట్లాడుతూ కడప నగరాన్ని స్పోర్ట్స్‌హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇందులో భాగంగా డీఎస్‌ఏ స్టేడియం ఆవరణంలో ఇప్పటికే పలు రకాల క్రీడాంశాలకు చోటు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మైదానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం 50 మీటర్ల గ్యాలరీ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి, మేయర్ భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, కార్పొరేటర్లు మల్లికార్జున, ఎస్ఎండీ షఫీ, మల్లికార్జున కిరణ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కడప నగర క్లస్టర్-3 అధ్యక్షుడు తోట కృష్ణ, మహేష్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్, ఏఈ ప్రతాప్ రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

రాణించిన బ్యాట్స్‌మన్

సెంచరీలతో చెలరేగిన యువ క్రీడాకారులు



తలపడుతున్న రెస్ట్ ఆఫ్ జోన్, సౌత్‌జోన్ జట్లు



హర్షవర్ధన్ (120 పరుగులు)



దత్తారెడ్డి (143 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 మల్టీడేస్ క్రికెట్ పోటీల్లో రెండోదశ మ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నార్త్‌జోన్, సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 379 పరుగులు చేసింది. జట్టులోని ఎం. హర్షవర్ధన్ 220 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సర్‌లతో 120 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ఎస్.వి. రాహుల్ 137 బంతుల్లో 19 ఫోర్లు, 1 సిక్సర్‌తో 101 పరు గులు చేశాడు. సూర్యకిరణ్ 61 పరుగులతో రాణించాడు. సెంట్రల్ జోన్ బౌలర్ నవీన్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ జోన్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 89.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 358 పరుగులు చేసింది. జట్టులోని బ్యాట్స్‌మన్ ఎం.కె. దత్తారెడ్డి 124 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్సర్‌లతో 143 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు మల్లికార్జున 3, సంతోష్‌కుమార్ 3, అఖిల్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

సిద్దవటం కోట నమూనా ఏర్పాటు చేయాలి

కడప కల్చరల్ : కడప నగర ఆధునీకరణలో భాగంగా ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతుండడం సంతోషదాయకమని, సిద్దవటం కోట నమూనాను కూడా ఏర్పాటు చేయాలని సౌత్ ఇండియన్ టూరిజం హెరిటేజ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి జార్జి, మగడలం ప్రసాద్, సహాయ కార్యదర్శి అశోక్‌లు ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు గండికోట, సిద్దవటం కోటలు రెండు కళ్ల లాంటివని, సిద్దవటం పూర్వం కడపకు కేంద్రంగా ఉండేదని, చరిత్రను భావితరాలకు అందించే క్రమంలో సిద్దవటం నమూనాను కూడా నగరంలోని ఏదైనా కూడలిలో ఏర్పాటు చేస్తే దాని ప్రాధాన్యతను గుర్తించినట్లవుతుందని కోరారు.

3న రాష్ట్ర స్థాయి సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామ వార్డు సచివాలయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 3న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా , నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలను తీర్చడమే జగనన్న ధ్యేయం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రజల అవసరాలను తీర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల కాంప్లెక్స్ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మండల కేంద్రానికి దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలను నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రజలకు ఏ చిన్న అవసరమొచ్చినా కార్యాలయానికి వెళ్లి పనులు చేయించుకోవాల్సి ఉండేది. వీరపునాయునిపల్లె మండలంలో తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో నిర్మించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు మణికంఠ, ఎంపీటీసీ రాఘవ యాదవ్, మాజీ సర్పంచు రవీంద్రనాథ్ రెడ్డి, తహసీల్దార్ విజయకుమారి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



రిజిస్ట్రార్‌కు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఏఎఫ్‌యూ : వీక్షణశక్తి జీవితకాలం ప్రభావవంతంగా ఉండాలంటే నేత్ర సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో భారతి కంటి ఆసుపత్రి సహకారంతో ఐ స్క్రీనింగ్ టెస్ట్, ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కళ్లు ప్రధానమైవని, వాటిని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఐ స్క్రీనింగ్ నిర్వహణ, నేత్ర సంరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం భారతి కంటి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శివతేజారెడ్డి పవర్‌పాయింట్ ద్వారా కంటి సమస్యలు, సంరక్షణ విధానాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

వైవీయూ : విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగం ఆచార్యులు డా. జి. విజయభారతి సూచించారు. బుధవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ, పీజీ కళాశాలలో 'కామర్స్ ఫెస్ట్-23' వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో కామర్స్‌కు మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగిందన్నారు. కామర్స్ చదివే విద్యార్థులకు చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫెస్ట్ కన్వీనర్ కె. ఆంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాధవీ.. వాస్తవాలు తెలుసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీ వెంకట సుబ్బమ్మ

కడప కోటిరెడ్డిసర్కిల్ : టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉంటున్న మాధవీ తొలుత వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు టీపీ వెంకటసుబ్బమ్మ, మూలె సరస్వతి, కృష్ణవేణి, బండి మరియలు తెలిపారు. బుధవారం కడప నగరంలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష గురించి మాధవి నోటికి వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. అంజద్‌బాష మహిళలను సోదరీమణులుగా భావిస్తూ గౌరవప్రదంగా మాట్లాడుతుంటే ఉన్నత పదవిలో ఉన్న ఆయన పట్ల ఏకవచనంలో మాట్లాడటం మాధవికి తగదన్నారు. లక్కిరెడ్డిపల్లెకు చెందిన మాధవి కడపకు వచ్చి విమర్శలు చేయడం దారుణమన్నారు.

తన వద్ద డబ్బు ఉందన్న అహంకారంతో వ్యవహరించడం తగదన్నారు. టీడీపీ హయాంలో జిల్లాతోపాటు నగరాన్ని ఏమాత్రం పట్టించుకోని నీ భర్త శ్రీనివాసులురెడ్డితో కలిసి ఎన్నికలు వస్తున్న తరుణంలో ప్రజల దృష్టిలో పడాలని ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కడప నగరంలో కోట్లాది రూపాయలతో వివిధ కూడళ్లు, ఇతర అభివృద్ధి పనులు జరుగుతుంటే చూస్తూ కూడా ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడటం దారుణమన్నారు. అభివృద్ధిపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం అవసరం లేదని, వైఎస్ఆర్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉమామహేశ్వరి, సునీతారెడ్డి, నారాయణమ్మ, సుశీలమ్మ, అమ్ములు, సాబీర, సరోజమ్మ, సుల్తాన, ఆదెమ్మ, అరుణ, సక్కుభాయిలు పాల్గొన్నారు.

వారి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్స్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసనాయక్‌ల సేవలు మరువలేనివని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ కొనియాడారు. 2020 నుంచి పెథాలజీ హెచ్ఓడిగా, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. వరలక్ష్మిని పులివెందుల మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్ఓడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం. శ్రీనివాసనాయక్‌ను ఆదోని మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. ఈక్రమంలో వారి బదిలీ సందర్భంగా కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల వైద్య విద్యార్థుల హాస్టల్ ఆవరణంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ వీరిద్దరు వైద్యకళాశాల అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసనాయక్, డాక్టర్ వరలక్ష్మిలు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

శిక్షణా ఫలాలను విద్యార్థులకు అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్

వైవీయూ : పాఠశాల సముదాయాల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు అందించి వారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలని కడప మండల విద్యాశాఖాధికారి ఎస్. ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌ల కరెక్షన్, లెసన్‌ప్లాన్, టీచర్స్‌డైరీ రాయడంలో అశ్రద్ధ వద్దని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఫిట్ ఇండియా వేడుకలు నిర్వహించాలని సూచించారు. కాగా మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో నిర్వహించిన కాంప్లెక్స్‌ను ఎంఈఓ పాలెం నారాయణ పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఏఎస్ఓ ఇలియాస్‌ఖాన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జావీదాఖానం, పి. నాగమణి, సీఆర్‌పీలు హాజీరాభాను, ఆదిమూలం సురేష్, వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని గ్రామీణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ జి.శివశంకర్‌రెడ్డి కోరారు. బుధవారం బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993 నుంచి అమలు పరచాల్సిన కంప్యూటర్ ఇంక్రిమెంటును కేవలం కొంతమందికి మాత్రమే ఏప్రిల్-2018 వరకు సర్వీసులో ఉన్న వారికి మాత్రమే రిలీజ్ చేశారన్నారు. అంతకుముందు రిటైర్డ్ అయిన వారికి మొండిచేయి చూపారన్నారు. అందరికీ అమలు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం రీజినల్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మాకర్ రెడ్డి, రామ్మూర్తి, వీరా రెడ్డి, వెంకటరామిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులను ఆదరించాలి



ముగ్గులను తిలకిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తదితరులు

కడప రూరల్ : హెచ్ఐవీ బాధితులను ఆదరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకొని బుధవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంగణంలో కమ్యూనిటీ సభ్యులకు ముగ్గుల పోటీలను ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా కమ్యూనిటీ సభ్యులకు ముగ్గుల పోటీని నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకొని, జాగ్రత్తలు వహించాలన్నారు. బాధితులను అందరిలా సమానంగా ఆదరించాలన్నారు. కమ్యూనిటీ సభ్యులు కూడా అందరితో సమానంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు తెలిపారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వీ భాస్కర్, ప్రసాద్, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

జీవన్ ఉత్సవ్ పాలసీతో లాభాలు



నూతన పాలసీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌డీఎం గిరిధర్, అధికారులు, సిబ్బంది

కడప కల్చరల్ : జీవన్ ఉత్సవ్ పాలసీతో చాలా లాభాలున్నాయని ఎల్ఐసీ కడప డివిజన్ ఎస్‌డీఎం గిరిధర్ అన్నారు. బుధవారం కడప డివిజనల్ ఆఫీస్ ఆవరణలో 'జీవన్ ఉత్సవ్ పాలసీ' వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆశించే ప్రయోజనాలు ఈ పాలసీలో ఉన్నాయని.. అందుకే దీనికి మార్కెట్లో అపూర్వమైన స్పందన తొలి రోజే లభించిందన్నారు. ఎల్ఐసీ సిబ్బంది కూడా ఈ పాలసీ తీసుకోవడానికి తొలిరోజే ఆసక్తి చూపడం 'జీవన్ ఉత్సవ్' పాలసీ ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. కేవలం ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లించే వెసలుబాటు వుందని, 90 రోజుల పసితనం నుంచి 65 ఏళ్ల వయసు వరకు ఈ పాలసీ ఇస్తామన్నారు. 18 సంవత్సరాలు వయసు దాటాక ఆదాయ ప్రయోజనం పొందవచ్చన్నారు. ఎంచుకునే డెఫర్మెంట్ పీరియడ్‌ను బట్టి సర్వైవల్ బెనిఫిట్‌లు ప్రారంభమవుతాయన్నారు. జీవితాంతం బీమా రక్షణ ఉంటుందన్నారు. తొలి రోజే స్పందించి తమ పేరిట పాలసీలు తీసుకున్న సిబ్బంది స్వర్ణకుమారి, సుభాషిణి, సుబ్రమణ్యం లను ఎస్‌డీఎం ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందరరావు, మేనేజర్ సేల్స్ శ్రీనివాస్, ఇతర డివిజనల్ మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్య ప్రసాద్, ఆనందరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు క్రీడాపోటీల్లో చక్కగా రాణించారు. వైవీయూలో ఇటీవల నిర్వహించిన రెండోదశ అంతర్ కళాశాలల టగ్ ఆఫ్ వార్‌పోటీల్లో కళాశాల జట్టు రెండోస్థానంలో నిలిచి రన్నరప్‌గా నిలవడంతో పాటు పలువురు క్రీడాకారిణులు అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలో పాల్గొనే వైవీయూ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం క్రీడాకారిణులకు కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ విద్యార్థినులు క్రీడల్లో చక్కగా రాణించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వైవీయూ యోగ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు మనీషా, షహనాజ్, షబానాలతో పాటు టగ్ ఆఫ్ వార్ రన్నరప్ జట్టు సభ్యులను అభినందించారు. యోగలో కాంస్యపతకం సాధించిన మనీషాను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. మదన్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎంగా రావాలి



బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 43వ డివిజన్‌లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని హామీలను నెరవేర్చారన్నారు. దేశానికి ఓ రోల్‌మోడల్‌గా జగనన్న పాలన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి రెడ్డిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు జమాల్‌వలీ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 20వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతమేర లబ్ధి జరిగిందో వివరించే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో 20వ డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీరంజన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.